వైభవంగా శివలింగ యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



గౌలిపురా: సుల్తాన్‌షాహీ కవేలికమాన్‌లోని హనుమాన్ ఆలయంలో బుధవారం శివలింగ యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సన్మానం



మామిడి మహాదేవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో మహిళలను చైతన్య పరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తానని కార్వాన్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి మహాదేవి అన్నారు. బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. బల్దియా ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌సింగ్, నర్సింగ్‌గౌడ్, గజిరే కిషన్, అమిత్‌ఖాన్, షకీలా, శివలాల్, అబీబ్, వనజ తదితరులున్నారు.

వార్షికోత్సవం



గోల్కొండ: విద్యార్థుల జీవితంలో కళాశాల వార్షికోత్సవం గుర్తించుకోదగినదని మెహిదీపట్నం రాయల్ జూనియర్ కళాశాల చైర్మన్ కె.జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం రేతిబౌలి రింగ్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యారంగంలో రాయల్ జూనియర్ కళాశాల ఒక ప్రత్యేక ముద్రను వేసిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

చార్మినార్: మీరాలంమండిలో బుధవారం సాయంత్రం దోమల నివారణకు ఎంటమాలజీ విభాగానికి చెందిన సిబ్బంది ఫాగింగ్ చేశారు. మీరాలంమండి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే దోమల బెడద ఎక్కువైందని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. స్పందించిన జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఎంటమాలజీ విభాగం సిబ్బంది బుధవారం సాయంత్రం దోమల మందు కొట్టారు. మీరాలంమండి మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాజుల అంజయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి పట్టివేత

లంగర్‌హౌస్: గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఎండీ లైన్స్‌లో నివాసముండే అన్వర్ ఖాన్ ఆటో డ్రైవర్. బీదర్ నుంచి గంజాయి తీసుకువచ్చి బుధవారం మధ్యాహ్నం లంగర్‌హౌస్ చెరువు కట్ట వద్ద అమ్మేందుకు ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఒక కిలో గంజాయి, ఫోన్, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంస్కృతిక సంస్థల సేవలు ఎంతో అవసరం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనంద భైరవి సాంస్కృతిక సేవా సంస్థ 13వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్ రావు మాట్లాడుతూ..సమాజానికి సాంస్కృతిక సేవా సంస్థల అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ.. రాములను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు గాయనీ గాయకుల సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మోటివేషనల్స్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, సంస్థ వ్యవస్థాపకురాలు శారద సాయి, అధ్యక్షుడు ఆనంద్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో సంజయ్ సింఘూరే, పద్మమాత్రే, ఆనంద్ సింగ్



గౌలిగూడ నుంచి ర్యాలీ నిర్వహించిన బజరంగ్ సేనా నాయకులు



మంగళ్‌హాట్‌లో..



జై భవానీ..

యువతకు స్ఫూర్తి.. ఛత్రపతి శివాజీ

జై శివాజీ..



నివాళులర్పిస్తున్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు మెట్టు శ్రీకాంత్

ఘనంగా శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో శోభాయాత్ర నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జంగమ్మెట్‌లో ..



ఉప్పుగూడలో..



గౌలిపురా డివిజన్ పటేల్‌నగర్‌లో..



బేగంబజార్‌లో..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ హైదర్‌గూడా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11 కేవీ నంది ముస్లాయిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా పరిధిలో..

గుంతల షా దర్గా, కేశవగిరి, ఫలక్‌నుమా తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవసరమైన మేరకు వివిధ సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ గోల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఏ కాలనీ, ఫ్రైడ్ అండ్ సాన్డ్స్ కాలనీ, నదీం కాలనీ, ఝూన్సీనగర్, సమతా కాలనీ, ఆదిత్య నగర్, అడమ్స్ కాలనీ, రాహుల్ కాలనీ ఫేస్-2, జమాలి కుంట, అరుణ కాలనీ, ఖులీ ఖుతుబ్‌షా నగర్, గ్రామర్ కాలనీ, సనా హోటల్, బంజారీ దర్వాజ, అట్టార షిడి, గోల్కొండ పోలీస్ స్టేషన్, బాలాన్సర్, రిసాలాబజార్, గోల్కొండ పోలీస్ క్వార్టర్స్, రేషంబాగ్, కటోరా హౌస్, గెలాక్సి థియేటర్ పరిసర ప్రాంతాలు, మౌలాగంజ్, గోల్కొండ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

కులగణనను సద్వినియోగం చేసుకోండి

దూద్‌బౌలి: కులగణన సర్వేలో పాల్గొనని వారికి ఈ నెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పించిందని దానిని సద్వినియోగం చేసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపునిచ్చారు. బీసీ కమిషన్ చేపట్టిన కులగణన అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం పాతబస్తీలోని దూద్‌బౌలి హుందా బజార్, ఉస్మాన్ బాగ్, మహారాజ్ గంజ్ ప్రాంతాల్లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు సభ్యులు ప్రభుత్వ అధికారులు పర్యటించారు. దాదాపు 200 ఇళ్లల్లో తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఇందులో 60 నుంచి 70 ఇళ్లల్లో సర్వే కాలేదని తేలిందని ఆయన తెలిపారు. కుల సంఘాల నాయకులు సామాజిక కార్యకర్తలు పలు రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్తలు ప్రజలను సర్వేలో పాల్గొనే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్, కో ఆర్డినేటర్ కన్యాలాల్ వీరితో పాటు బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పుష్ప ఠాగూర్, డీపీఓ శ్రీనివాస్, నోడల్ అధికారితో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కులగణన అవగాహన కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

విద్యారంగ వ్యాప్తికి విశేష కృషి



రాజ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్, ముజీబ్

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి విశేష కృషి చేస్తానని టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ యూనియన్ టీఎన్జీఓస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా కేఆర్.రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. అనంతరం కేఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరింత బాధ్యతతో ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, ఫక్రుద్దీన్ అహ్మద్, దేవేందర్ కుమార్, భరత్, పవన్ బాబు, భాస్కర్, అశోక్, శ్రీనివాస్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసును 48 గంటల్లో ఛేదించిన అఫ్జల్‌గంజ్ పోలీసులు

అఫ్జల్‌గంజ్: కిడ్నాప్‌కు గురైన 2 ఏళ్ల బాలుడిని 48 గంటల్లో సురక్షితంగా కాపాడి తల్లికి అప్పగించిన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన దేవి (25) తన రెండేళ్ల కుమారుడితో కలిసి వారం రోజుల క్రితం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు వచ్చింది. నగరంలో బంధువుల కోసం ప్రయత్నించగా వారి ఆచూకీ దొరకకపోవడంతో సీబీఎస్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ ఫుట్‌పాత్‌పై ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 15న రాత్రి ఫుట్‌పాత్‌పై పడుకుంది. మరుసటిరోజు ఉదయం లేచే సరికి కుమారుడు లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని ఆటోలో తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆటో నెంబర్ ఆధారంగా హకీంపేట్ వెళ్లి నిందితుల ఇంటిపై దాడి చేసి వారి వద్ద నుంచి బాలుడిని రక్షించాడు. కిడ్నాప్‌కు పాల్పడిన షేక్ అహ్మద్ (25), మజీదా బేగం (25), మహమూదీ బేగం (48)లను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రదారి అబ్దుల్ సల్మాన్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

పరస్పర దాడి ఘటనలో ఒకరి మృతి

లంగర్‌హౌస్: వేర్వేరు కార్లలో వెళ్తూ పోటాపోటీగా పాటలు పెడుతూ పరస్పరంగా దాడులు చేసుకున్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది.ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ వివరాల ప్రకారం..గోల్కొండకు చెందిన మొహమ్మద్ ఖిజర్(43), ఈ నెల 15న రాత్రి వరుసకు సోదరుడు, మిత్రులతో కలసి మెహిదీపట్నం నుంచి గోల్కొండకు కారులో వెళ్తూ ఎక్కువ శబ్దంతో పాటలు పెట్టుకున్నారు. అదే సమయంలో పక్క నుంచి మరో కారులో కొందరు ఎక్కువ శబ్దంతో పాటలు పెట్టుకుని వెళ్తున్నారు. పక్కకు తప్పుకోవాలంటూ హారన్ కూడా మోగించుకున్నారు. నానల్‌నగర్ సిగ్నల్ వద్దకు రాగానే ఇరువర్గాల పరస్పరంగా దాడులు చేసుకున్నారు. ఇంటికెళ్లాక ఖిజర్ తనకు అనారోగ్యంగా ఉందంటూ గుడిమల్కాపూర్ ఆస్పత్రికి వెళ్లాడు. ఆ తర్వాత గుండెపోటు వచ్చి అదే రోజు మృతి చెందాడు. అందరు అతను అనారోగ్యం, గుండెపోటుతో మరణించాడని అంత్యక్రియలు కూడా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆ కారులో ఉన్న మృతుడి స్నేహితులు ఆయన ఇంటికి వెళ్లి గొడవ జరిగిన విషయం, అతడిని కొట్టిన విషయాన్ని కుటుంబీకులకు తెలిపారు. ఆ గాయాలకు తట్టుకోలేక మృతిచెందినట్టు కుటుంబీకులు మంగళవారం లంగర్‌హౌస్ పోలీసులను ఆశ్రయించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించిన తర్వాత బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అనిల్ రావిపుడికి 'విజయకృష్ణ' అవార్డు ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపుడికి సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల పేరిట నెలకొల్పిన విజయకృష్ణ సిల్వర్ క్రౌన్ అవార్డును ఈ నెల 20న రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు శృతిలయ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శృతిలయ సీల్‌వెల్ కార్పొరేషన్, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దర్శకురాలు విజయనిర్మల జయంతి వేడుకలు, దర్శకుడు జంధ్యాల 75 సంవత్సరాల వజ్రోత్సవ సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సినీనటులు మురళీమోహన్, నరేష్, ఆలీ, పవిత్ర లోకేష్, నందినిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ముగ్గురికి జైలు

గౌలిపురా: న్యూసెన్స్ కేసులో ముగ్గురు యువకులకు రెండు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదిల్ (21), సయ్యద్ తబ్రేజ్ (20), షేక్ ఇస్మాయిల్ (20) భవానీనగర్ స్టేషన్ పరిధిలోని బస్తీలు తిరుగుతూ పిల్లలను భయపెడుతూ న్యూసెన్స్ చేస్తున్నారు. దీంతో వీరిని భవానీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. బుధవారం ఈ ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన ఇన్‌చార్జి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

'35 లక్షల మాలల భవిష్యత్తుకు అన్యాయం చేయొద్దు'



టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాల సంఘాల నేతలు

సుల్తాన్‌బాజార్: తెలంగాణలో 35 లక్షల మంది మాలల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేయొద్దని తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకుడు డేర బాలకిషన్ కోరారు. బుధవారం గాంధీభవన్‌లో తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు డేర బాలకిషన్, రాంచందర్, చెన్నయ్య, కర్ణం కిషన్, వెంకటేశ్వర్లతో కూడిన బృందం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను కలిసి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారని దాని ప్రకారం..ప్రస్తుతం ఎస్సీల్లోని 59 ఉప కులాలలో 15 శాతంతో పాటు అత్యంత వెనుకబడిన మేతగాని బ్యాగరి, బైండ్ల, బుడగజంగాలు లాంటి ఉపకులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగ శ్రీను, విశాల్, ఆవుల సుధీర్, సత్యనారాయణ, జంగ్లి కిషన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ మండలానికి చెందిన 239 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన దస్తావేజులు సమకూర్చుకొని మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాను నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ధ్రువపత్రాలన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తుదారులకు వెంటనే చెక్కులు మంజూరవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీఉజ్‌జమా, అబీబ్‌చౌస్ తదితరులున్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మేరు కులస్తుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించాలి

అబిడ్స్: మేరు కులస్తుల కార్పొరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి ఏడాది గడిచినా నేటికీ ప్రారంభించడం లేదని మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో లక్షలాది మంది మేరు కులస్తులు కీలకంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. బుధవారం మేరు సంఘం నాయకులు ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్, సున్నాకూల్ ప్రశాంత్, మల్లాల నవీన్‌కుమార్, పోల్కం వినయ్ రాజ్‌తో పాటు పలువురు నాయకులు సచివాలయానికి తరలివెళ్లి ముఖ్యమంత్రి కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. వెంటనే మేరు కులస్తులకు 20 వేల కుట్టు మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించి 40 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడిగా కొనసాగుతున్న తనకే చైర్మన్ పదవి అవకాశం ఇవ్వాలని పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.



ప్రదర్శన చేపట్టిన పోల్కం శ్రీనివాస్, శివకుమార్ తదితరులు

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్జీఓస్ డైరీని అందజేస్తున్న జగదీశ్వర్, ముజీబ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగుల హెల్త్ కార్డ్స్, పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, కొత్త జిల్లాల్లో అదనపు క్యాడర్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, తప్పకుండా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ప్రతి స్పందించినట్లు తెలిపారు.

ఎస్సీల సమస్యలు పరిష్కరించాలి

చాంద్రాయణగుట్ట: జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా, సభ్యులు వడ్డెపల్లి రామచంద్రను బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి ఎస్సీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో తెలంగాణలో పర్యటిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



నగలకు మెరుగులద్దుతామంటూ..

దృష్టి మరల్చి బంగారు గొలుసుతో పరార్

చాంద్రాయణగుట్ట: ఆభరణాలకు మెరుగులద్దుతామంటూ ఇద్దరు దుండగులు యువతి దృష్టి మరల్చి బంగారు గొలుసుతో ఉడాయించిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుజూసింది. పోలీసుల వివరాల ప్రకారం..శంషీర్‌గంజ్ కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన ఆలేటి సంజీవరావు హేమలత తన కుమార్తె అక్షర(24)తో కలిసి నివాసం ఉంటుంది. ఈ నెల 18న మధ్యాహ్నం 12 గంటలకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వీరి ఇంటికి వచ్చి వెండి, కాపర్, బంగారు ఆభరణాలకు పాలిష్ చేస్తామంటూ నమ్మబలికారు. దీంతో అక్షర మొదటగా ఇంట్లో ఉన్న వెండి, కాపర్ గ్లాసలను ఇవ్వడంతో, వారు పౌడర్‌తో వాటిని క్లీన్ చేయడం చూసిన ఆమె సరిగ్గానే చేస్తున్నారని నమ్మింది. వెంటనే నాలుగు తులాల బంగారు గొలుసుకు పాలిష్ చేయమని వారికి ఇచ్చింది. దీంతో గొలుసును నీటిలో వేసిన దుండగులు పౌడర్ కలిపి..స్టౌపై వేడి చేయమని ఆమెకు సూచించారు. ఆమెకు కూడా కొంచెం పౌడర్ ఇచ్చి అందులో కలుపమని చెప్పారు. దీంతో ఆమె లోనికి వెళ్లి పాత్రను పరిశీలించగా, అందులో గొలుసు కనిపించలేదు. మోసపోయానని గ్రహించిన ఆమె వెంటనే బయటికి వచ్చి చూడగా దుండగులు అప్పటికే పరారయ్యారు. ఈ ఘటనపై హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.